# కాకతీయ గవర్నమెంట్ కాలేజ్‌లో “ట్యాలీ ఏస్ విత్ జి.ఎస్.టి” శిక్షణ ప్రారంభం









**తొలి అక్షరం/హనుమకొండ ఫిబ్రవరి 11 :** కాకతీయ గవర్నమెంట్ కాలేజ్ (స్వయం ప్రతిపత్తి), హనుమకొండలో మూడు రోజుల “ట్యాలీ ఏస్ విత్ జి.ఎస్.టి” నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫ్. జి. శ్రీనివాస్‌లి గారు అధ్యక్షత వహించారు. తన ప్రసంగంలో ఆయన ప్రస్తుత పోటీ ప్రపంచంలో ట్యాలీ మరియు జి.ఎస్.టి పరిజ్ఞానం అత్యంత అవసరమని పేర్కొన్నారు. కేవలం డిగ్రీ సరిపోదని, ప్రాక్టికల్ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ పై అవగాహన ఉంటేనే ఎంప్లాయబిలిటీ మెరుగవుతుందని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా డా. ఎ. అనిల్ కుమార్, టి.ఎస్.కె.సి కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ , ట్యాలీ మరియు జి.ఎస్.టి శిక్షణ పొందిన విద్యార్థులకు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ అకౌంటెంట్, జి.ఎస్.టి ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ప్రాసెస్ అసోసియేట్ , బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, ఆడిట్ అసిస్టెంట్ వంటి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రముఖ కంపెనీలు అయిన టి.సి.ఎస్., ఇన్ఫోసిస్, విప్రో, అకసెంచర్, జెన్‌పాక్ట్, క్యాప్‌జెమిని వంటి సంస్థలులి ఫైనాన్స్ మరియు అకౌంటింగ్ రోల్స్ లో వాణిజ్య విద్యార్థులను నియమిస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా చార్టర్డ్ అకౌంటెంట్ ఫర్మ్స్, జి.ఎస్.టి కన్సల్టెన్సీలు, ఎం.ఎస్.ఎం.ఇలు, మాన్యుఫ్యాక్చరింగ్ మరియు ట్రేడింగ్ కంపెనీలు కూడా ట్యాలీ పరిజ్ఞానం ఉన్న విద్యార్థులను నియమిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డా. రాజని లత గారు మరియు డా. రాజశేఖర్ గారు, అలాగే అధ్యాపకులు డా. శ్రీనాథ్, డా. శ్రీకాంత్, డా. జె. చిన్న, డా. వెంకన్న, డా. జి.కె. కుమార్, డా. గంగిశెట్టి, డా. నవీన్, డా. వినయ్, డా. వందన పాల్గొన్నారు. టాస్క్ ట్రైనర్ శ్రీ రామకృష్ణ గారు శిక్షణ అందించి ట్యాలీ మరియు జి.ఎస్.టి పై ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ కల్పించారు.బి.కాం మరియు బి.బి.ఎ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం స్టూడెంట్స్ ఎంప్లాయబిలిటీ ను పెంపొందించడంతో పాటు ఇండస్ట్రీ రిక్వైర్మెంట్స్‌కు అనుగుణంగా స్కిల్స్ అభివృద్ధి చేయడానికి దోహదపడింది.

# రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొన్న కళాశాల విద్యార్థిని... అభినందించిన ప్రిన్సిపాల్






**తొలి అక్షరం/హనుమకొండ : ఫిబ్రవరి 11 :** కాకతీయ ప్రభుత్వ కళాశాల హనుమకొండ లో ఈరోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఉప్పల శివ ఇటీవల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొని వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వాలంటీర్లు అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ద్వారం నుంచి ఎన్ఎస్ఎస్ డ్రమ్స్ వాయించుకుంటూ వాలంటీర్లు చప్పట్లు కొడుతూ శివను కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్ శివను శాలువాతో సత్కరించి కళాశాల నుండి రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొన్నందుకు అభినందించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి కళాశాల నుండి ఈ పరేడ్ లో పాల్గొనే అవకాశం దక్కిన ఏకైక వ్యక్తి శివ అని ప్రిన్సిపాల్ గారు కొనియాడారు. కళాశాల కీర్తిని ఢిల్లీ వరకు తీసుకెళ్లారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సీతారాములు, డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ ధన సింగ్, ఎన్ సి సి ఆఫీసర్లు డాక్టర్ రాజేందర్, డాక్టర్ ప్రసూన, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్ , పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శివ నాగ శ్రీను, అధ్యాపకులు డాక్టర్ కోమల, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సమ్మయ్య, డాక్టర్ రవీందర్, డాక్టర్ జె చిన్న , డాక్టర్ వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చివరగా రిపబ్లిక్ డే పరేడ్ వెళ్లి వచ్చిన శివ మాట్లాడుతూ ఎంతో కష్టతరమైన శిక్షణ పూర్తి చేసుకొని పరేడ్ చేసే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని ఢిల్లీ వరకు వెళ్లి పర్యటనలో పాల్గొనుటకు ఆర్థికంగా అన్ని విధాల సహకరించిన కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ కవిత, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రాజయ్య, డాక్టర్ శివ నాగ శీను, డాక్టర్ సీతారాం సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశాడు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 80 శాతం పైగా విజయాలు: మంత్రి పొన్నం ప్రభాకర్







**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 11:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ముఖ్య నేతలతో కలిసి రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీర్వాదం లభించిందని, 80 శాతం కంటే ఎక్కువ మున్సిపాలిటీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేశాయని, ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించాయని ఆయన ఆరోపించారు. ఎక్కడికక్కడ ఘర్షణ వాతావరణం సృష్టిస్తూ భౌతిక దాడులకు దిగారని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఒత్తిడి తీసుకువచ్చారని విమర్శించారు. గత 10 సంవత్సరాలుగా మున్సిపాలిటీలకు సరైన నిధులు ఇవ్వలేకపోయిన బీజేపీ, ఇప్పుడు ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోం దని అన్నారు. కేంద్రంలో 12 సంవత్సరాలుగా అధికా రంలో ఉన్న బీజేపీ పట్టణ సమస్యలు ఎందుకు పరిష్కరి ంచలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున ప్రకటనలు ఇచ్చి హామీలు ఇవ్వడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి మంత్రి వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చేసిన అభివృద్ధిని పట్టణ ప్రాంతాల్లో కూడా కొనసాగిస్తున్నామని అన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కలిసి డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసే ప్రయత్నాలు చేశారని, పోలీసులపై దాడులు, ఘర్షణలు సృష్టించారని ఆరోపించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ వ్యవహారశైలి సరికాదని, పోలీస్ జీపులో నుంచి వ్యక్తులను లాగడం చట్టవిరుద్ధ చర్యలేనని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ పోలీసులను బెదిరించేలా వ్యవహరించారని అన్నారు.తెలంగాణకు కేంద్రం తగిన నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని, అలాంటి బీజేపీకి రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు లేదని మంత్రి పేర్కొన్నారు. మత రాజకీయాలు చేసి లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

మున్సిపాలిటీలకు బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత బీజేపీదేనని, వాటి అమలుకు కాంగ్రెస్ పార్టీ నిలదీస్తుందని స్పష్టం చేశారు.

కేంద్రం సహకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా అమలు చేస్తుందని తెలిపారు.ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**తొలి అక్షరం/ములుగు,ఫిబ్రవరి 11:** ములుగు కొత్త మున్సిపాలిటీలోని వార్డు నెంబర్ 14, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రములో బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానికసుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంప్స్ నిర్మించడమే కాక వీల్ చైర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 18 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి పోలింగ్ స్టేషన్ లొ అక్కడి అధికారులకు చూయించి ఓటర్లు తమ ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**తొలి అక్షరం/ములుగు,ఫిబ్రవరి 11:** ములుగు కొత్త మున్సిపాలిటీ ఎన్నికల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూములుగు జిల్లా మున్సిపాలిటీ కి మొదటి సారిగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పోలింగ్ ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సంపత్ రావు, ఈ డి ఎం దేవేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యువత ఆలోచించాలి.. ఓటును ఆగమాగం చేయకండి

● ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**తొలి అక్షరం/ములుగు,ఫిబ్రవరి 11:**రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు జిల్లా యువతకు ఒక ముఖ్యమైన బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల పట్ల సీరియస్‌గా దృష్టి సారించాలని కోరారు.ఈ దేశం మీది, రేపటి భవిష్యత్తు కూడా మీదే. యువత అంటే కేవలం ఓటు వేసే యంత్రాలు కాదు, ఈ సమాజ గతిని మార్చే శక్తి. మీరు తీసుకునే ఒక్క నిర్ణయం రాబోయే ఐదేళ్ల మన ఊరి అభివృద్ధిని శాసిస్తుంది.“అల్లాటప్పాగా తీసుకోవద్దు: “మున్సిపల్ ఎన్నికలంటే ఏదో మొక్కుబడిగా జరిగేవి కావు. వీటిని అల్లాటప్పాగా (తేలికగా) తీసుకోవద్దని యువతను కోరుతున్నాను. మీ వార్డులో, మీ మున్సిపాలిటీలో నిజమైన మార్పు రావాలంటే మీ ఆలోచనలో పదును ఉండాలి.“ ఓటును ఆగమాగం చేయకండి: “ఎన్నికల సమయంలో వచ్చే ప్రలోభాలకు లొంగిపోయి, మీ అమూల్యమైన ఓటును ఆగమాగం చేయకండి. ఎవరో చెప్పారనో, తాత్కాలిక ప్రయోజనాలకో ఆశపడి భవిష్యత్తును పణంగా పెట్టవద్దు. ఆలోచించి, విజ్ఞతతో ఓటు వేయండి.“అభివృద్ధికి అండగా నిలవండి: “మన ములుగు జిల్లా ప్రగతి పథంలో సాగాలన్నా, మౌలిక వసతులు మెరుగుపడాలన్నా అది యువత చేతుల్లోనే ఉంది. విద్యావంతులైన యువత రాజకీయ పరిణామాలను గమనించి, అభివృద్ధిని కాంక్షించే నాయకత్వానికి అండగా నిలవాలి.‘ ‘చివరగా, యువత కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవాలను గమనించి మన ప్రాంత బాగు కోసం బాధ్యతగా ఓటు వేయాలని లక్ష్మణ్ బాబు గారు పిలుపునిచ్చారు.

# నేషనల్ కరాటేలో బంగారు పతకాలు సాధించిన నాచారం ఛాంపియన్స్






**తొలి అక్షరం/ఉప్పల్ ఫిబ్రవరి 11 :** జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి, ఐ ర్ ఏ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటిలకు దేశంలోని నలుమూలల నుండి క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర, ఉప్పల్ నియోజకవర్గ, నాచారం డివిజన్ నుండి బి.రాము స్పారింగ్ విభాగంలో మరియు బి.ఆదర్శిని కటాస్ లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బంగారు పథకం సాధించారు. వీరిరువురిని తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ రాపోల్ సుదర్శన్ మరియు మాస్టర్. రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి బంగారు పథకాలు అందజేశారు. రాపోల్ సుదర్శన్ మాట్లాడుతూ, బి.రాము గౌడ్ మరియు ఆదర్శిని నేషనల్ కరాటేలో బంగారు పథకాలు సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే కాకుండా నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వీరు భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి ఓలంపిక్స్ స్థాయికి ఎదగాలని దీవించారు

## హుజురాబాద్ 25వ వార్డులో ఓటేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**తొలి అక్షరం/హుజురాబాద్,ఫిబ్రవరి11:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో హుజురాబాద్ లోని 25 వ వార్డులో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా గంగా డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యస్ఫూర్తిని చాటాలని విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ పట్టణ అభివృద్ధి కోసం, ప్రజల శ్రేయస్సు కోసం నిజాయితీగా పనిచేసే అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు.

## బోటింగ్ యూనిట్ తాత్కాలికంగా నిలిపివేత

**తొలి అక్షరం/ములుగు,ఫిబ్రవరి 11:**
ములుగు జిల్లా వెంకటాపురం మండలం లో రామప్ప సరస్సు వద్ద మహా శివరాత్రి సందర్భంగా రామప్పకు భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఫిబ్రవరి 15 నుంచి 16 వరకు రామప్ప బోటింగ్ యూనిట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తికి రిమాండ్



**తొలి అక్షరం/అన్నమయ్య జిల్లా: పుంగనూరు : ఫిబ్రవరి 11 :** హత్యాయత్నం కేసులో వ్యక్తిని రిమాండ్ కు తరలించినట్లు ఎస్పై నాగేశ్వరావు తెలిపారు. చౌడేపల్లి పోలీస్ స్టేషన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఆయన కథనం మేరకు మండలంలోని దిగువపల్లి పంచాయతీకి చెందిన గంగులమ్మను సమీప బంధువు తమ్ముడు వరసైన నాగరాజా ఆస్తి విషయమై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాయ పడ్డ మహిళను తిరుపతి రుయాకు తరలించడం జరిగింది. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది . అక్క పై హత్యాయత్నానికి పాల్పడిన నాగరాజును బుధవారం కొలింపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి పుంగనూరు న్యాయస్థానంలో హాజరుపరచగా జడ్జి నిందితున్ని రిమాండుకు ఆదేశించారని ఆయన తెలిపారు.

## ముగిసిన ములుగు జిల్లా ములుగు మున్సిపాలిటీ ఎన్నికలు

**తొలి అక్షరం/ములుగు,ఫిబ్రవరి 11:**
ములుగు కొత్త మున్సిపాల్టీ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 20 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 80.41 శాతం% పోలింగ్ నమోదైంది. 20 వార్డులలో మొత్తం 13,963 ఓటర్లలో 11,227 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇందులో 5,878 మంది మహిళల ఓటర్లు, 5,349 పురుష ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు.

# యూరియా కొరతతో అల్లాడుతున్న రైతులు



**తొలి అక్షరం/ములుగు,ఫిబ్రవరి 11:** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలో యాసంగి పంటలు వేసిన రైతులు తీవ్రమైన యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి నాట్లు వేసి ఇప్పటికే 2025 రోజులు గడిచినా, ఇప్పటివరకు సరైన మోతాదులో యూరియా అందకపోవడంతో పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గ్రామాల్లో యూరియా ఉన్నట్టే కనిపిస్తున్నా, వాస్తవంగా మాత్రం రైతులకు దొరకని పరిస్థితి నెలకొంది. కొత్త కొత్త యాప్‌లు, ఆన్‌లైన్ బుకింగ్ విధానాలు గ్రామీణ రైతులకు పెద్ద సమస్యగా మారాయి. చదువుకున్న కొందరే బుక్ చేసుకోగలుగుతుండగా, ఎర్ర బటన్, పచ్చ బటన్ తప్ప తెలియని పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.“కళ్లముందే యూరియా నిల్వలు ఉన్నా, చేతిలో ఉన్న ముద్దను పక్కన పెట్టి ఇతరుల కడుపు నింపుతున్న పరిస్థితి. మాకేమో దొరకడం లేదు” అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే వర్షాకాలంలో దిగుబడులు తక్కువగా రావడం, బోనస్ డబ్బులు పడకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్న రైతులకు ఇప్పుడు యూరియా కొరత మరో పెద్ద దెబ్బగా మారింది. పంటకు అవసరమైన సమయంలో ఎరువులు అందకపోతే దిగుబడులు మరింత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు “రైతే వెన్నుముక”, “రైతే రాజు” అంటూ నినాదాలు వినిపిస్తున్నా, వాస్తవంగా మాత్రం రైతు ఎదుర్కొంటున్న కష్టాలు పాలకులకు పట్టడం లేదని విమర్శిస్తున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతే ఈ రోజు ఆకలి బాధను ఎదుర్కొనే పరిస్థితి రావడం దారుణం అని మండిపడుతున్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి:గ్రామస్థాయిలో సరిపడా యూరియా సరఫరా చేయాలిఆన్‌లైన్ బుకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఆఫ్‌లైన్ విధానం అమలు చేయాలినిరక్షరాస్య రైతులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి న్యాయం చేయాలిలేదంటే, పంట నష్టాలతో రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రైతును కాపాడితేనే వ్యవసాయం బతుకుతుంది వ్యవసాయం బతికితేనే దేశం నిలుస్తుంది

## 49వ డివిజన్ రాంనగర్ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత..



**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 11:**
కరీంనగర్ నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మశ్రీ భర్త శ్రీనివాస్ రెడ్డి సెల్‌ఫోన్‌ను బీజేపీ అభ్యర్థి మరియు బీజేపీ నాయకులు గుంజుకుని పగులగొట్టిన ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత పెరగడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బీజేపీ నాయకులను నిలదీశారు. ఓడిపోతున్నామని గ్రహించి దాడికి ప్రయత్నించి సెల్‌ఫోన్ గుంజుకుని పగలగొట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన తీవ్రంగా ఖండించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొనడంతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు.

## రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రమే కారణం: సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు..

**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 11:** రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కేంద్రం సరైన పరిమాణంలో యూరియా సరఫరా చేయకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై నరేందర్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. “రైతులకు యూరియా అందించాల్సిన బాధ్యత మీకు లేదా? రాష్ట్రానికి కేంద్రం ఎంత యూరియా కేటాయిస్తోంది, ఎంత విడుదల చేస్తోంది అనే విషయంపై ఎందుకు మాట్లాడడం లేదు?” అని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి రాజకీయ విమర్శలు చేయడం తగదని అన్నారు. అలాగే మాజీ మంత్రి గంగుల కమలాకర్‌పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. “ప్రజాస్వామ్యం గురించి గంగుల కమలాకర్ మాట్లాడటం సిగ్గుచేటు. అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలపై ఎంత శ్రద్ధ చూపారో ప్రజలకు తెలుసు” అని వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా కోటాను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు.



## ఘనంగా లంబాడీ తండా గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమం

- హాజరైన గ్రామ నూతన గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ , ఉప సర్పంచ్ జీళ్ళ రజీత ప్రశాంత్





**తొలి అక్షరం/బెల్లంపల్లి ఫిబ్రవరి 11 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని లంబాడీ తండా గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ నూతన సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ , ఉప సర్పంచ్ జీళ్ళ రజీత ప్రశాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ , ఉప సర్పంచ్ జీళ్ళ రజీత ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ పథకం కింద ఆరు నెలలు నిండిన చిన్నారులకు మొదటి మ్యాగా ధాన్యాలు ప్రవేశపెట్టేందుకు తల్లులు, గర్భిణీలకు పోషకాహారం, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే ఈ కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. చిన్నారుల్లో ప్రయోజనాలు అపోషణ తగ్గించడం, తల్లుల్లో ఆరోగ్య అవగాహన పెంచడం లక్ష్యం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నూతన గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ , ఉప సర్పంచ్ జీళ్ళ రజీత ప్రశాంత్ ని అంగన్వాడీ టీచర్లు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు బందారపు లక్ష్మణ్ అంగన్వాడి కేంద్రానికి ఎలక్ట్రిక్ ఫ్యాన్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాంటెంకీ శిరీష, కార్యక్రమ నిర్వహకురాలు అంగన్వాడీ టీచర్ అంజలి, గ్రామ పెద్దలు కనవేనీ రాజేశం, స్వయం సహాయక మహిళా సంఘాల మండల అధ్యక్షులు కుచ్చుల లావణ్య , సీఏ మంజుల, అంగన్వాడీ సహాయకురాలు లక్ష్మి, గర్భిణీ స్త్రీలు, తల్లులు, గ్రామస్తులు కోట రవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియాను నేరుగా అందించాలి: ఏఐకేఎంఎస్ డిమాండ్



**తొలి అక్షరం/కూసుమంచి, ఫిబ్రవరి 11:** రైతులకు యూరియాను యాప్ ద్వారా కాకుండా నేరుగా అందించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కూసుమంచి మండల కేంద్రంలో తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షులు బజ్జూరి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు మాది రైతు ప్రభుత్వం, మేము రైతులను ఉద్ధరిస్తామని చెప్పి, ఎన్నడూ లేని విధంగా యూరియాను యాపు పద్ధతిని పెట్టి రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువురాని రైతులు, సెల్ ఫోన్ లేని రైతులు చాలా మంది ఉన్నారన్నారు. కొత్త పద్ధతి పెట్టడం వలన రైతులకు యూరియా అందటం లేదని, షాపుల వద్దకు యూరియా కోసం రైతులు వెళితే యాప్ బుక్ చేసుకోవాలని చెప్పి తిప్పి వెనక్కి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే అదునుగా షాప్ యజమానులు రైతుల పేరుతోనే యాప్ బుక్ చేసుకొని బ్లాక్ లో పెట్టి 500 నుంచి 600 వరకు ఒక కట్ట అమ్మడం జరుగుతుందని ఆరోపించారు. మన మండలానికి ఇవ్వవలసిన యూరియా ఇతర మండలాలకు బ్లాకు ద్వారా వెళ్లిపోతా ఉందని ఆరోపించారు. ఇది అధికారులు తెలిసిన తెలియనట్టుగా వదిలేస్తున్నారన్నారు. ఇప్పటికైనా యూరియాని యాప్ ద్వారా కాకుండా రైతులకు నేరుగా సరిపడా ఇవ్వాలని, ఏ మండలానికి వచ్చిన యూరియాని ఆ మండల రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తక్షణమే రైతులకు, కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం ఖమ్మం జిల్లా నాయకులు కలకొండ సురేష్, అఖిల భారత రైతు కూలీ సంఘం కూసుమంచి మండల అధ్యక్ష కార్యదర్శులు మాతంగి రామస్వామి, చెరుకుపల్లి వీరయ్య, నాయకులు బత్తుల ఉప్పయ్య, నోముల రంగారావు, నిమ్మల వెంకన్న, కలకొండ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులర్పించిన బిజెపి నాయకులు



**తొలి అక్షరం/అన్నమయ్య జిల్లా: పుంగనూరు ఫిబ్రవరి 11:** పుంగనూరు పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని హైస్కూల్ వీధిలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి బిజెపి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ గొప్ప భారతీయ తత్వవేత్తగా, ఆర్థికవేత్తగా, చరిత్రకారుడుగా, పాత్రికేయుడుగా, రాజకీయ శాస్త్రవేత్తగా ఎదిగి ఎన్నో సేవలు అందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. ప్రస్తుతం యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మల్లికా రాణి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెద్దమట్టం బాబు, సీనియర్ నాయ కులు అరవపల్లి వెంకటరెడ్డి, టీవీఎస్ ప్రసాద్, ఉమా శంకర్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

